క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం మాధవ నగర్‌లోని శ్రీ శివ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవయ్య, కార్యదర్శి చంద్రశేఖర శర్మ, సభ్యులు సుబ్రహ్మణ్యం, విశ్వనాథ శెట్టి, రామయ్య, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


కల్యాణమూర్తులుగా సీతారాముల వారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ శ్రీరాముల దేవాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉసిరిచెట్టు పూజ, ఊంజల్ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వేడుకలో పాల్గొని మాట్లాడారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలుకూరి ప్రభాకర్, కరివేన నిత్యాన్నదాన సత్రం నిర్వాహకులు డాక్టర్ వేణుగోపాల్, కట్టా రాఘవేంద్ర ప్రసాద్, ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో స్టాఫ్‌నర్సు పతకాల పంట


బంగారు పతకాలతో డి.మంజులాదేవి

కర్నూలు(హాస్పిటల్): రాజమండ్రిలో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్–2024 పోటీలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న డి.మంజులాదేవి బంగారు పతకాలు సాధించారు. ఆమె వంద మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో 3 బంగారు, ఒక వెండి పతకం సాధించారు. రాష్ట్రంలో ఓ స్టాఫ్‌నర్సు స్పోర్ట్స్ ఈవెంట్‌లో పాల్గొని పతకాలు సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

రేడియాలజి సదస్సు


సదస్సులో పాల్గొన్న వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగర శివారులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రేడియాలజీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు జోనల్ సీఎంఈ (నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు) నిర్వహించారు. సదస్సుకు రాయలసీమలోని వివిధ మెడికల్ కాలేజీల నుంచి రేడియాలజీ పీజీ వైద్య విద్యార్థులు 300 మందికి పైగా హాజరయ్యారు. వారికి వివిధ రేడియాలజి వైద్య గురువులు బోధించారు. రేడియాలజి పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ మునిరుద్దీన్ అహ్మద్‌ను ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ కృష్ణనాయక్, రేడియాలజి ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ అబ్దుల్ గఫూర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి సన్మానించారు.

సమన్వయకర్తల నియామకం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఆరు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. పత్తికొండకు మాత్రం ఎవరినీ నియమించలేదు. డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణను కోడుమూరుకు, కర్నూలు సిటీ అధ్యక్షుడు షేక్ జిలానీబాషాను కర్నూలుకు, ఎమ్మిగనూరుకు ఎం.కాశీంవలి, ఆదోనికి జి.రమేష్‌యాదవ్, మంత్రాలయానికి పీఎస్ మురళీకృష్ణరాజును, ఆలూరుకు లక్ష్మీనారాయణలను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాలు ఇచ్చినట్లు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

- సిబ్బంది లేక నోటీసులకే పరిమితం
- ముందుకు కదలని ఫైళ్లు
- అవినీతి అక్రమాలకు అడ్డాగా టౌన్ ప్లానింగ్ విభాగం


నోటీసు ఇచ్చిన భవనంలోనే అదనపు ఫ్లోర్ నిర్మిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): 'ఈ ఏడాది సెప్టెంబర్‌లో నగరంలోని 26వ వార్డు కృష్ణానగర్‌లో ఓ అపార్టుమెంటులో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని నోటీసులు ఇచ్చారు. తక్షణం పనులు నిలిపివేశారు. ఏమైందో ఏమో గానీ జరిమానా విధించలేదు. తిరిగి అదనపు ఫ్లోర్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎలాంటి చర్యలు ఉండవన్న ధీమాతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన నోటీసులను పక్కన పడేసి తమ పని కానిచేస్తున్నారు.

➤ స్థానిక 24వ వార్డు పరిధిలోని మద్దూరు నగర్‌లో అనుమతులు లేకుండా వాణిజ్య భవనం నిర్మించారు. ఈ భవనాలకు ప్లాన్ అప్రూవల్ లేదు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. పార్కింగ్ సౌకర్యం లేదు. సెట్‌బ్యాక్స్ లేవు. అక్రమంగా నిర్మిస్తున్నారంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నెల రోజులు తిరగకముందే యథేచ్ఛగా నిర్మాణాలు మళ్లీ మొదలుపెట్టారు. విజిలెన్స్ అధికారుల దృష్టికి వచ్చినా.. ఎక్కడి వారు అక్కడ నిమ్మకుండిపోయారు. అక్రమ నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనేఉన్నాయి.

➤ పాతబస్టాండ్ ప్రాంతంలో ఓ వాణిజ్య భవనం అడ్డగోలుగా నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారిలో ఈ నిర్మాణం చేపడుతున్నారు. ఒక్క ఇంచు కూడా సెట్ బ్యాక్స్ వదల్లేదు. పార్కింగ్ సౌకర్యం లేదు. నాలుగు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం తమకు సంబంధం లేన్నట్లుగా వ్యవహరిస్తోంది.

➤ ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా అమరావతి హోటల్ నిర్వాహకులు అదే స్థలంలోనే వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్స్‌తో పాటు పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే మూడు అంతస్తులు నిర్మించారు. ఇదే దారిలోనే టౌన్ ప్లానింగ్ అధికారులు తిరుగుతుంటారు. మరి వారికి కనిపించడం లేదా?

అక్రమాలు గుర్తించారు కానీ చర్యల్లేవు

నగరంలో ప్రతి భవన, అపార్టుమెంటు నిర్మాణానికి సంబంధించి నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్లాన్‌ను సమర్పించి అనుమతులు వచ్చిన తరువాత ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. సైట్ ఇంజినీర్, ప్లానింగ్ కార్యదర్శుల మధ్య లావాదేవీలు నడుస్తున్నాయి. యథేచ్ఛగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. తద్వారా ఫీజుల రూపంలో నగరపాలక సంస్థకు ఆదాయం కోల్పోతోంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో ఎన్నికల సమయంలో నగరంలో 23 భవనాలను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో ప్రధాన రహదారి వద్ద సెట్‌బ్యాక్స్, పార్కింగ్ లేకుండా అక్రమంగా వాణిజ్య భవనాన్ని నిర్మించారు. అలాగే సంకల్ బాగ్ రహదారి ప్రధాన రోడ్డులో అడ్డగోలుగా వాణిజ్య సముదాయం నిర్మించారు. అడిగే వారు లేకపోవడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎవరికి వారే అనే రీతిలో వ్యవహారం నడుస్తోంది. నగరంలోని అన్ని ప్రధాన ఏరియాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ విభాగం పనితీరు చూస్తుంటే అవినీతిని ప్రోత్సహించినట్లు కనిపిస్తోంది.

నోటీసులకే పరిమితం

నగరంలో దాదాపు 6 లక్షల జనాభా ఉంది. 1.39 లక్షల ఇళ్ల అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇక ప్రతి నెల వంద వరకు ప్లాన్ అప్రూవల్స్ వస్తుంటాయి. వీటిని పర్యవేక్షణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 52 వార్డుల పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఒకరు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు ఉన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్లానింగ్ కార్యదర్శి ఉన్నారు. అయితే ఈ విభాగంలో కీలకంగా పని చేయాల్సిన డిప్యూటీ సిటీ ప్లానర్, ఇరువురు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్లు లేరు. సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఫైళ్లు కదలడం లేదు. ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా నడుస్తున్నాయి. దీంతో ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం టౌన్‌ప్లానింగ్ విభాగం హడావుడి చేస్తుంది. వెంటనే స్పందించడం నోటీసులు జారీ చేయడం చేస్తున్నారు. ఆ తరువాత మిన్నకుండి పోతున్నారు. నోటీసులు అందుకున్న భవన యజమానులు టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. దీని వల్ల అనుమతులు లేకున్నా.. అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నోటీసులు ఇచ్చినా.. తిరిగి నిర్మాణాలు చేపడుతున్న వాటిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదు. అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

2,264 క్యూసెక్కుల నీరు విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల (కోట్ల విజయభాస్కర్ రెడ్డి) బ్యారేజీకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం నదిలో 4,720 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, బ్యారేజీ ఒక గేటు పైకెత్తి 2264 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2,445 క్యుసెక్కుల నీటిని వదులుతున్నారు.

షూటింగ్‌బాల్ విజేత పల్నాడు జట్టు



కప్పు అందుకుంటున్న పల్నాడు జిల్లా షూటింగ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): గత రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల షూటింగ్‌బాల్ పోటీల్లో విజేతగా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. అలాగే ఎన్టీఆర్ జిల్లా (ద్వితీయ స్థానం), అన్నమయ్య జిల్లా (తృతీయ స్థానం)లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు ఆదివారం సాయంత్రం గుడ్ షప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ యేసుదాసు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, అతిథిగా హాజరైన కళ్ల నాగవేణి రెడ్డి కప్పు, మెడల్స్ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

లూసిడా క్యాలిగ్రఫీపై వర్క్‌షాపు


వర్క్‌షాపును పరిశీలిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు

కర్నూలు సిటీ: విద్యార్థుల చేతి రాతను మార్చే అంశంపై లూసిడా క్యాలిగ్రఫీ వర్క్‌షాపు ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో టౌన్ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాపులో డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల చేతి రాతను మార్చేందుకు ఇలాంటి వర్క్‌షాపు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. అక్షరాలు చక్కగా ఉంటే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని చెప్పారు. వర్క్‌షాపులో గూంటూరు నుంచి క్లబ్ తరపున శ్రీరామ్ రామ్మోహన్, నిర్వాహకులు సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న 104 వాహన సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీ 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, ఎం.పెద్దయ్య డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు నెలల నుంచి జీతాలు రాక కుటుంబసభ్యులతో కలిసి పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో 104 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన చేపట్టి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేసేలా బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 104 వాహనాలను ప్రైవేట్ ద్వారా కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని, తద్వారా ఒక్కో వాహనంపై ప్రభుత్వానికి నెలకు రూ.50 వేలు మిగులుబాటు అవుతాయన్నారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఉద్యోగులకు సక్రమంగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

అవసరం మేరకే సెల్‌ఫోన్ వాడాలి


సెల్లు పురాణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: అవసరం ఉన్నంత వరకే సెల్‌ఫోన్‌ను ఉపయోగించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన ×సెల్లు (సెల్‌ఫోన్) పురాణం× శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినోదంతో పాటు విజ్ఞానం అందిస్తుందన్నారు. అలాగే యువత పెడదారి పట్టడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడారు. రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సెల్ ఫోన్ వల్ల కలిగే లాభనష్టాలతో అందరికీ అర్థమ య్యే రీతిలో పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. పుస్తకాన్ని పమిడి వెంకటేశ్వర్లుకు అంకితం ఇచ్చారు. కళాకారులు శామ్యూల్, మహమ్మద్ మియ్యా, బాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి సెల్లు పురాణం లోని పద్యాలను చదివి వినిపించారు. డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కన్వీనర్లుగా లక్ష్మీకాంతారావు, సంగా ఆంజనేయులు, శివయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం


వక్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: మనిషికి సంపూర్ణ ఆరోగ్యం ఎంతో అవసరమని, ఇది మన చేతుల్లోనే ఉందని కర్నూలు వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుజ్జల భవానీప్రసాద్ అన్నారు. సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం ఆయుష్మాన్ భవ కార్యక్రమం జరిగింది. గాడిచెర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. 'వయోవృద్ధులకు ఆరోగ్య సూత్రాలు' అనే అంశంపై డాక్టర్ భవానీ ప్రసాద్ ప్రసంగించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం చేయాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 'ఐరోపా దేశాల యాత్ర అనుభవాలు' అనే అంశంపై సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లెపోగు నాగరాజు మాట్లాడారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జే.ఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. డాక్టర్ పార్వతీ దేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. నరసం అధ్యక్షులు కావెం సుబ్బలక్ష్మమ్మ, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 284 దరఖాస్తులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు 284 దరఖాస్తులు వచ్చినట్లు నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని కేవీఆర్ కళాశాల, మున్సిపల్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, రోజా వీధి, ప్రకాశ్‌నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, నరసింహా రెడ్డి నగర్, లేబర్‌కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. ఈ నెల 28వ తేదీ వరకు కొత్త గా ఓటు నమోదు, వివరాల మార్పునకు గడువు ఉందని, ఎన్నికల వెబ్‌సైట్‌లో స్థానిక బీఎల్‌ఓల ద్వారా దరఖాస్తు చేసుకొవచ్చని తెలిపారు. ఏఆర్ఓ, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 18వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ముట్టడికి నగరంలోని అన్ని వార్డుల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. ఆదివారం సీపీఐ సదాశివ నగర్ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇల్లు లేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదల గోడును ఆయనకు గుర్తు చేసేందుకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్వర్, షాకీర్, బాషా, రెహమాన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కర్నూలు (టౌన్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తిపై ఆదివారం మూడవ పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇటీవల ఆసుపత్రిలో ఎలుకల బెడద అంటూ పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలు రాయించడంలో అక్కడ పనిచేసే పెస్టిసైడ్ సూపర్‌వైజర్ మల్లికార్జున పాత్ర ఉందని అతనితో హెల్త్ ఇన్‌స్పెక్టర్ వాగ్వివాదానికి దిగాడు. కులం పేరుతో దూషించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

యాదవులకు తీవ్ర అన్యాయం

కర్నూలు న్యూసిటీ: నామినేటెడ్ పదవులు కేటాయించడంలో తెలుగుదేశం ప్రభుత్వం యాదవులకు తీవ్ర అన్యాయం చేసిందని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యాదవ సంఘ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి యాదవులు ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో బీసీలలో అధిక శాతంగా ఉన్న యాదవులకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో టీడీపీ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యాదవులకు ప్రాధాన్యత కల్పిస్తూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

కర్నూలు న్యూసిటీ: కర్నూలు నగరంలోని 6వ వార్డు బేకారి కట్ట వద్ద మెడికవర్, శాంతిరామ్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. క్యాంపులో 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు స్వచ్ఛంద సంస్థల నాయకులు టి.మద్దిలేటి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలు ఇవ్వండి

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలను అందజేయవచ్చని కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య



కర్నూలు కల్చరల్: హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన జీవీ కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగిన హేతువాద సంఘం మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా విష్ణుమూర్తి, బాలచందర్, సంయుక్త కార్యదర్శులుగా సత్యనారాయణ, సత్తెన్న, ఈసీ మెంబర్స్‌గా లక్ష్మీ ప్రియదేవి, రామశేషయ్య, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు కృష్ణయ్య తెలిపారు.

భక్తజన వల్లభా.. వైకుంఠ వాస


స్వామివారికి నమస్కరిస్తున్న భక్తజనం

కర్నూలు కల్చరల్: కలియుగ వైకుంఠ వాసుడు.. భక్తజన వల్లభుడు.. ఏడుకొండల వేంకటేశ్వరుడు ఇలపై వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల వేంకటేశ్వర స్వామి రూపంలో భగవంతుడిని తీర్చిదిద్ది కర్నూలు నగరవాసులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ వేడుక ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాక్షాత్కారమైంది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైకుంఠ వాసునికి ఉదయాస్తమాన ఆర్జిత సేవలను వేద పండితులు విశేషంగా నిర్వహించారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, శత కలశాభిషేకం, సూర్యప్రభ వాహన సేవ, తోమాల సేవ, అష్టాదళ పాద పద్మార్చన, సహస్ర నామార్చన, పుష్పయాగం, సుదర్శన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి హోమం, తిరుప్పావడ సేవ, గరుడ సేవ, సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవార్ల పల్లకీ సేవ, సహస్ర దీపాలంకర సేవ, ఎదుర్కోళ్ల సేవ, కల్యాణ మహోత్సవం, పవళింపు సేవ, వేదాశీర్వచనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తరించారు. దీంతో మైదానంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రజా ప్రతినిధులు, నగర ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, ఉపాధ్యక్షుడు మహాబలేష్, కోశాధికారి కల్కిమురళీ, సలహాదారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేంకటేశ్వర స్వామివారు

విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలి


పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలలకే విద్యుత్ చార్జీల పెంపుదలకు నిర్ణయం తీసుకోవడం అన్యాయమని, దీన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని సీపీఎం హెచ్చరించింది. ఆదివారం మూడోరోజు సీపీఎం చేపట్టిన ప్రజాపోరు యాత్ర నగరంలోని పలు వార్డుల్లో కొనసాగింది. 26, 27 వార్డుల పరిధిలోని న్యూకృష్ణానగర్, ఆదిత్యనగర్, విఠస్‌నగర్, చౌడేశ్వరినగర్, మయూరి హోమ్స్ ప్రాంతాల్లో సీపీఎం నాయకులు సాయిబాబా, సుధాకరప్ప ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే 31, 41 వార్డుల పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు అలివేలమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రెండో వార్డులో పార్వతయ్య, ఎస్‌డీ ఖాజా ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగం ఉంచాలి



మాట్లాడుతున్న గురుదాస్

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్‌లో రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో జరిగిన డీహెచ్‌పీఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యంత దృఢమైనదని, అలాంటి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి బీజేపీ కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. అనేక సార్లు రాజ్యాంగాన్ని సవరించుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని కార్పొరేటర్లకు తాకట్టుపెట్టి వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. డిసెంబర్ 5వ తేదీన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎస్.మునెప్ప, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


రిటైర్డ్ హెచ్‌ఎంలు, ఎంఈఓలను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు నెల వరకు పదవీ విరమణ చేసిన 25 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులను ఆదివారం టౌన్ మోడల్ హైస్కూల్లో ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఏపీ హెచ్‌ఎంల సంఘం మాజీ అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. జిల్లాలో కరువు వల్ల అనేకమంది వలస వెళ్లిపోతుండడంతో వారి పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. అలాంటి పిల్లల గుర్తించి చదువుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. పదో తరగతిలో అధిక ఉత్తీర్ణత శాతం సాధించేలా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన 25 మందిని ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసయాదవ్, నారాయణ, కోశాధికారి హుసేన్, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.